ప్రజాశక్తి
శుక్రవారం 10 నవంబర్ 2023

'ఆదర్శ' విద్యార్థులకు పసిడి పతకాలు

ప్రజాశక్తి - భామిని

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా లో జరిగిన అండర్ -19 కబడ్డీ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బిడ్డికి ఆదమ్మ, బిడ్డిక రబిక బంగారు పతకాలు సాధించారు. వీరు బంగారు పతకాలు సాధించేలా తర్ఫీదు ఇచ్చిన పిఇటి గొర్ల శివరాంప్రసాద్‌ను, పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నిబంధనలు తూచ్

- ఆకాశాన్నంటిన ధరలు
- పర్యవేక్షణ లేని అధికారులు
- అందరికీ ఆమ్యామ్యాలు
- అమాంతంగా ధరలు పెంచేసిన వ్యాపారులు

బాణసంచా వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన విజయనగరంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నాయి. సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా వ్యాపారులు ఇష్టానుసారం మందుగుండు సామాగ్రి ధరలు పెంచేసి దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారికి ఆనుకొని, పెట్రోల్‌బంకు సమీపాన శాశ్వతంగా షాపులు నిర్మించినా, తాత్కాలికంగా షెడ్‌లు వెలిసినా అధికారులు కనీసం కూడా పట్టించుకో పోవడంపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని ఆర్‌టిఒ కార్యాలయం చుట్టుపక్కల గత కొంతకాలంగా మందుగుండు సామాగ్రి హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు సాగుతున్నాయి. దీపావళి సందర్భంగా వేలాది మంది జిల్లా నలుమూలల నుంచే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. అయితే వ్యాపారులు ఇదే అదునుగా బాణాసంచా ధరలను అమాంతంగా పెంచేసి కొనుగోలుదారులను దోచేస్తున్నారు. వాస్తవానికి బాణా సంచా ధరలు ఆ ప్యాకింగ్‌లపై ఉన్న ధరకు, వాస్తవ ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. చిచ్చుబుడ్డి ప్యాకెట్ పై ఎంఆర్‌పి ధర రూ.500 ఉంటే దాని ధర వంద రూపాయలు మాత్రమే ఉంటుంది. కానీ వ్యాపారులు వాటిని రూ.400నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఇలా కాకరు పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, భూ చక్రాలు, తాళ్లు, సిసింద్రీలు, మతాబులు, వెన్నముద్దలు, తాటాకు బాంబులు, పెన్సిళ్లు ఇలా అన్నింటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఉన్నాయి. దీపావళి నేపథ్యంలో కోట్లాది రూపాయలు వ్యాపారాలు చేస్తున్నా వాటికి లెక్కా జమ ఉండడం లేదు. వాటికి పన్ను కూడా కట్టిన దాఖలాలు లేవు. వీటి ధరలపై అడిగితే తమ సిబ్బందితో బయటకు గెంటేసే దుస్థితి ఉంటోంది. మరోవైపు మందుగుండు షాపుల్లో బాల కార్మికులను నియమించుకుంటూ అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పనివారిని ఆదుకున్న దాఖలాలు కూడా లేవు.

పట్టించుకోని అధికారులు

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారికి అనుకొని భారీగా బాణాసంచా విక్రయాలు సాగిస్తున్నారు.మరోవైపు పెట్రోల్‌బంకుకు కనీసం వంద మీటర్ల దూరం కూడా లేకుండా షాపులు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ధరలపై గాని,ప్రభుత్వ నిబంధనలపై గాని అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు ఏటా వీరు లంచాలు ఇవ్వడం వల్లే వారు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శస్తున్నారు. ఎవరికి ఇవ్వాల్సిందే వారికి ఇవ్వకపోతే ఇక్కడ షాపులు నడపగలమా? అంటూ స్వయాన వ్యాపారులు చెప్పడం అధికారుల తీరుకు అద్ధం పడుతోంది.

అందుబాటులో లేని ధరలు

దీపావళి అంటేనే అనందాల సందడి.. ఇంటిళ్ల పాదీ కలిసి జరుపుకునే పండగ.. కానీ నేడు అలాంటి పండగ సామాన్య ప్రజలకు గుదిబండగా మారుతోంది. బాణా సంచా కొనాలంటేనే గుండె గుబేలు మంటోంది. విజయనగరంలో దీపావళి సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హోల్‌సేల్ అంటూ రిటైల్ ముసుగులు వ్యాపారులు దోచుకుంటు న్నారు. అందరూ సిండికేట్ అయిపోయి గత నెలరోజులుగా ధరలను అమాంతంగా పెంచేశారు. బాణా సంచా ప్యాకింగ్‌లపై ఉన్న ధరకు, వాస్తవ ధరకు 200 రెట్లు వ్యతాసం ఉంటుంది. కానీ వ్యాపారులు ఎంఆర్‌పి ధరలకు లేదంటే దానికి పదిశాతం తగ్గించి విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఉదాహరణకు అయాన్ చిచ్చుబుడ్డిల ధర రూ.650ఉండగా, 500వరకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి వీటి ధర రూ.200 లోపే ఉంటుంది. కానీ వ్యాపారులు ఎంఆర్‌పి ముసుగులో జనాలను దోపిడీ చేస్తున్నారు.

టోకెన్లే అనుమతి పత్రాలు?

- బోడిమెట్ట చుట్టూ అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -మక్కువ

భూగర్భగనుల శాఖ లీజుదారు నుండి తీసుకున్న రవాణా రసీదులనే అనుమతి పత్రాలుగా చూపిస్తూ అక్రమంగా కంకర తరలించుకుపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక మండలం నుంచి వేరొక మండలానికి ప్రధాన రహదారి గుండా దర్జాగా కంకర తీసుకుపోతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వివరాల్లోనికి వెళ్తే...

మండలంలోని కాశీపట్నం పరిధిలోని సర్వేనెంబర్ 91లో ఉన్న బోడిమెట్ట పరిధిలో మూడు రోజులుగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి ఇక్కడి నుండి సీతానగరం మండలం తామరకండి నుండి బక్కుపేటకు వెళ్లే నూతన రహదారికి కంకర తరలిస్తున్నారు. మన్యం జిల్లాకు సంబంధించి గనులను చూస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ నుండి సుమారు 1000 క్యూబిక్ మీటర్లకు రవాణా రసీదులను సంబంధిత కాంట్రాక్టర్ పొందారు. అయితే ఈ రసీదులనే అనుమతి పత్రాలుగా చూపుతూ కంకర తరలించకపోతున్నారు. కంకర తవ్వకాలకు సంబంధించి అనుమతులున్న చోట నుండే తీసుకువెళ్లాలని రవాణా రసీదులు ఇచ్చినట్లు రాఘవ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తాము ఎలాంటి అనుమతి పత్రాలు ఇవ్వలేదని ఆయన విలేకరులకు తెలిపారు.

ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదు

బోడుమెట్ట పరిధిలోని కంకర తవ్వకాలకు ఎవరికి అనుమతులు ఇవ్వలేదని తహశీల్దార్ సూర్యనారాయణ అన్నారు. అలాగే తవ్వకాలు జరుపుతున్నట్లుగానే మైనింగ్ శాఖ అధికారులు కూడా తమకు సమాచారం ఇవ్వలేదని ఆయన అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

బోడికొండ చుట్టూ మట్టి తవ్వుతున్న అక్రమణ దారులు

పట్టుకున్నారు... వదిలేశారు

బోడిమెట్ట పరిధిలోని అక్రమ తవ్వకాలు దందా యథేచ్ఛగానే కొనసాగుతూ వస్తుంది. గతంలో ప్రైవేట్ లేఔట్ల కోసం గ్రావెల్ తవ్వుతుండగా మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. అపరాధ రుసుం వసూలు చేసి విడిచిపెట్టారు. ఇంత జరిగినా ఏ విధమైన అనుమతులు లేకుండా దొంగచాటు తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. దీనిపై అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇతర మండలాలకు సైతం ఇక్కడ కంకర ఏ విధమైన పర్మిట్లు లేకుండానే తరలించుకపోతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యారంగ అభివృద్ధికి కృషిచేయాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్‌జెడి జ్యోతికుమారికి స్వాగతం పలుకుతున్న డిఇఒ, ఎంఇఒలు

జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మండల విద్యాశాఖాధికారులు కృషి చేయాలని విశాఖపట్నం జోన్-1 ఆర్‌జెడి జ్యోతి కుమారి కోరారు. గురువారం స్థానిక డిఇఒ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఒ ఎన్.ప్రేమ కుమార్ ఆర్‌జెడికి స్వాగతం పలికారు. ఇదే సందర్భంగా జిల్లా ఎంఇఒల సంఘం అధ్యక్షులు సామల సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణరావు, ట్రెజరర్ ఎం.శ్రీనివాసరావు ఆర్‌జెడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ పాఠశాలలు తరచూ తనిఖీ చేసి రిపోర్టులు అందజేయాలన్నారు. మన్యం జిల్లా పదో తరగతి ఫలితాల్లో శత శాతం సాధించేలా కృషి చేయాలని ఎంఇఒలను కోరారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గృహనిర్మాణం, ప్రాధాన్యతా భవనాలు సకాలంలో పూర్తిచేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గృహనిర్మాణం, రీ-సర్వే, జగనన్న పాల వెల్లువ, వికాస్ భారత్ సంకల్పయాత్ర, పంచాయతీ రాజ్ పనులు, తదితర పథకాలపై సమీక్ష నిర్వహిం చారు. వీడియో కాన్ఫెరెన్స్ అనంతరం జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ప్రభుత్వం నిర్దేశిం చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేందుకు నిర్దిష్ట ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. గృహనిర్మాణాలు పూర్తిచేసేందుకు కావా ల్సిన మౌలిక వసతులు కల్పించాలని, ప్రాధాన్యత భవనాలు పూర్తిచేసి అప్పగించాలని, ప్రతివారం 25శాతం చొప్పున భవనాలు పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, సిపిఒ పి.వీర్రాజు, సిఎస్‌డిటి జిల్లా మేనేజర్ ఎండి నాయక్, అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - మక్కువ

రానున్న పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. మండలంలోని ఎర్రసామంతులవలస ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యా బోధనలో లోపాలు ఉండరాదన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువుకు అడుగులు వేయాలన్నారు. ఇష్టంతో చదివితే ఏదీ కష్టం కాదని హితవు పలికారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఎర్రసామంతులవలస, అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ జె.శాంతీశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో జ్ఞాపకశక్తి పెంపు

ప్రజాశక్తి - సీతానగరం

క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని డాక్టరు బిఆర్ అంబేద్కర్ గురుకులం, ప్రతిభ పాఠశాల, కెజిబివి విద్యాలయాల ప్రాంగణాల్లో రాష్ట్ర స్థాయి 67వ కరాటే పోటీలను గురువారం ఆయనతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉందని ఆసక్తిగల క్రీడల్లో రాణించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు మన జిల్లాలో నిర్వహించడం ముదావాహమని అన్నారు. డిఇఒ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు అండర్ 14,17,19 బాలురు, బాలికలకు సంబంధించి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 600 మంది క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 14,17,19 సంవత్సరాలలోపు పాల్గొన్న బాలురు -బాలికలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ కల్యంపూడి సింహాచలం, ఎంఇఒలు సూరి దేముడు, వెంకటరమణ, ప్రిన్సిపాళ్లు కె.ఈశ్వరరావు, పి.వెంకటనాయుడు, జె.సంధ్య, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పిడిలు, పిఇటిలు డిటి గాంధీ, ఎం.వాసుదేవరావు, మజ్జి రామకృష్ణ, మండంగి మురళి, ముప్పాళ శ్రీను, బలగ శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జెసి

పోటీలకు జ్యోతిప్రజ్వలన చేస్తున్న జెసి గోవిందరావు, ఎమ్మెల్సీ రఘువర్మ

మా పొలంలో మట్టికీ పన్ను కట్టాలా?

ప్రజాశక్తి - సాలూరు

మా పొలంలో మట్టి పెరుగుకోడానికీ మేం పన్ను కట్టాలా? మేం ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి తీయడం లేదు, ఒక పొలంలో మట్టిని మరో పల్లపు ప్రాంతంలోకి రవాణా చేసుకుంటున్నాం అని రైతులు, ట్రాక్టర్ యజమానులు ఫిర్యాదు చేశారు. గురువారం డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిబ్బంది దందాపై వారు మొరపెట్టుకున్నారు. గత కొద్ది నెలలుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి పిక్కరాయి, మట్టి, కంకర రవాణాపై గుత్తాధిపత్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ కంపెనీ ఎక్కడికక్కడ ప్రయివేటు సైన్యాన్ని నియమించుకుని వారితో వసూళ్లు చేపడుతోంది. ట్రాక్టర్ పిక్కరాయి లోడుపై అదనంగా రూ.1200 వసూలు చేస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఈ భారం పడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు కొత్తగా ఈ ఆంక్షలు విధించడంపై సామాన్య ప్రజలు గుర్రుగా ఉన్నారు. సొంత పొలంలో, స్థలాల్లో నుంచి మట్టిని, కంకరను మరోచోట ఉన్న సొంత లోతట్టు భూమి లోకి మట్టి తరలిస్తే ప్రభుత్వానికి ఎందుకు పన్ను కట్టాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఈ ప్రాంత రైతులు, ట్రాక్టర్, జెసిబి యజమానులు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తామని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ హామీ ఇచ్చారు. గురువారం వారు డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. దీనిపై ఆయన సంబంధించిన కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. సొంత స్థలాల్లో నుంచి మట్టి, కంకరను మరోచోటకు రవాణా చేసుకుంటే మీకెందుకు పన్ను కట్టాలని ఆయన ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము మట్టి, కంకర రవాణాపై ఆంక్షలు విధిస్తున్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విధానం మార్చాలని రైతులు, ట్రాక్టర్ యజమానులు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద పెద్ద కాంట్రాక్టు పనులు చేస్తున్న వారిపై ఆంక్షలు లేకుండా సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

రాఘవేంద్ర కనస్ట్రక్షన్స్ వేధింపులపై డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు

కంపెనీ ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బలిజిపేటలో దాహం కేకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రమైన బలిజిపేట మెట్టవీధిలో ప్రజలు దాహం కేకలు పెడుతున్నారు. తమ సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోనందుకు నిరసనగా గురువారం వారు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ స్థానిక పంచాయతీ కార్యదర్శి, స్థానిక నాయకులకు తాగునీటి అవస్థలపై ఎన్నిసార్లు విన్న మించామని, మా గోడు వినే పరిస్థితి లేదని తెలిపారు. గతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి తాగడానికి మంచినీరు తెచ్చుకునే వారమని, కాస్త దూరమైనా కాలినడకన వెళ్లి మంచినీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉందనే, కానీ నేడు ఆ బోరు అక్కడ లేకుండా చేశారని వాపోయారు. దీంతో అక్కడ నుంచి నీళ్లు తెచ్చుకోవడానికి లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని వారు వాపోయారు. ఇంటింటా కొళాయి కార్యక్రమం పేరుతో ఇంటిముందు దిష్టిబొమ్మల్లా కొళాయిలను ఏర్పాటు చేసినా, నేటి వరకు వాటి ద్వారా తాగునీటి సదుపాయం కల్పించకపోవడం దారుణమన్నారు. నెల రోజులుగా మంచినీరు తాగడానికి లేదని అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు వై.మన్మధరావు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఎంతో ఆర్భాటంగా ఇంటింటి కొళాయిలు వేశారని, దీంతో నిరంతరం తాగునీళువస్తాయని ఆశపడ్డ ప్రజలు నిరాశే మిగిలిందన్నారు. అధికారులు, నాయకులు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు ఉపయోగలేదని అన్నారు. ఇప్పటికైనా తాగడానికి నీళ్లు ఇవ్వాలని మెట్ట వీధి మహిళలు ఆవేదన పాలకులు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ నిరసనలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

తప్పలను సరిదిద్దాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఓటర్ల జాబితాలో ఉన్న తప్పిదాలను త్వరితగతిన సరిదిద్దాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. గురువారం సీతంపేట, భామిని మండలాల సూపర్ వైజర్లు, బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటరు జాబితాలోని ఓట్లను తొలగించేటప్పుడు ఎన్నికల నియామావళికి అనుగుణంగా తొలగించాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదుకు అర్హత ఉన్నవారిని చేర్పించాలని అన్నారు. చనిపోయిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రం ద్వారా నిర్ధారించుకొని తొలగించాలన్నారు. సరిగ్గా కనబడని, తప్పుగా ముద్రించబడిన ఫొటోలను మార్చాలని అన్నారు. సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట, భామిని తహశీల్దార్లు నరసింహమూర్తి, అప్పారావు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్వతీపురంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో సెల్లార్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అనవసరమైన విషయాలకు తగాదాలు పడొద్దని, కోర్టుల చుట్టూ తిరిగి ప్రజలు తమ సమయాన్ని వృథా చేసుకోవద్దని పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ అన్నారు. గరుగుబిల్లిలో పార్వతీపురం మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షతన న్యాయ సేవ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ తగాదాలు కేసులు పెండింగ్లో ఉన్నట్టయితే మండల లీగల్ సర్వీస్ అథారిటీ వారిని సంప్రదించినట్లయితే రాజీ చేయడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు పల్లెలు తమతర బేధం లేకుండా ఉండేవని, నేడు సమాజం విచ్ఛిన్నమై అనవసరమైన తగాదాలకు దారితీయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని అవగాహన కలిగి మంచి చెడులను ఆలోచించి, ఒకరు కష్టనష్టాల్లో మరొకరు పాలుపంచుకుని చక్కనైన సమాజంగా మెలగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసలై బంధాలను మరిచి విచిత్రంగా వ్యవహరి స్తున్నారని అన్నారు. ప్రజలు కొనుగోలు విషయం లోనూ ఎలాంటి సమస్యలైనా ఉన్నట్టయితే వినియో గదారుల ఫోరం ద్వారా సమస్యలు పరిష్కరించే దిశగా చట్టాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది టి.జోగారావు, న్యాయవాదులు ఎం.వెంకటరమణ, బి.పరుశురాం, తహశీల్దార్ జివి జనార్ధన్, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఎస్సై ఎం.రాజేష్, సర్పంచ్ ఇందుమతి గ్రామస్తులు పాల్గొన్నారు.

కురుపాం : న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ కురుపాం మండల ప్యానెల్ అడ్వకేట్ కె.అశోక్ కుమార్ అన్నారు. గురువారం జాతీయ న్యాయ వ్యవస్థ దినోత్సవం సందర్భంగా స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో గల పూతికవలసలో గిరిజన హక్కులు, చట్టాలు, చైల్డ్ రైట్స్ యాక్ట్, మ్యారేజ్ యాక్ట్ లీగల్ సర్వీస్ యాక్ట్ లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది కె.హరిబాబు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

బాధితులు ఉచిత న్యాయ సహాయం పొందండి

సాలూరు : భర్తల చేత గానీ, ఇంకెవరి చేతనైనా పీడించబడుతున్న మహిళలు, వ్యక్తులు ప్రభుత్వం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ మీరా జాస్పిన్ చెప్పారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని స్వయం సహాయక సంఘాల కార్యాలయంలో స్ఫూర్తి మహిళా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. పీడిత మహిళలు ఎవరైనా ఉచిత న్యాయ సహాయ కేంద్రం ద్వారా సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మీరా జాస్పిన్ కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతిరావు, న్యాయవాది శ్రీనివాసరావు, మెప్మా సిఎంఎం ఎ.పుష్ప, స్ఫూర్తి మహిళా సంఘం డైరెక్టర్ బి.రాధ పాల్గొన్నారు.

14 నుంచి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

70 అఖిల భారత సహకార వారోత్సవాలు పోస్టరును జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు విడుదల చేశారు. గురువారం జాయింట్ కలెక్టరు చాంబర్లో జరిగిన కార్యక్రమంలో పోస్టరు విడుదల చేస్తూ ఈనెల 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలు జరుగుతాయని, ఈ కార్యక్రమాల్లో సహకారశాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. సహకార వ్యవస్థ విజయాలను ప్రచారం చేయాలన్నారు. ప్రజలందర్నీ సహకార వ్యవస్థలో భాగస్వాములను చేయాలని, సహకార శాఖ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా కోపరేటివ్ అధికారి సన్యాసినాయుడు, డిసిసిబి బ్రాంచి మేనేజరు రవి, కోపరేటివ్ ఎడ్యుకేషను అధికారి ఎం.రమేష్ బాటు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువి నాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి బి జగన్నాథ రావు గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో గర్భిణీలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి పరిధిలో 82మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి స్మృతి తెలిపారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీల్లో వైద్య పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1400 నుండి 1600 మందికి ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

రూ.కోటితో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామంలో రూ.కోటి ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ మాచర్ల మహేష్ గ్రామస్తులకు తెలిపారు. మండలంలోని విక్రంపురంలో గురువారం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, చెరువులు, మట్టిరోడ్లు, ఆర్టికల్చర్‌లో మొక్కలు పెంపకం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ, ఇంజనీరింగ్ కన్సల్ట్ కృష్ణప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్యతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌బి, బరువు, ఎత్తు, తదితరమైన తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేసి పలు సూచనలు, సలహాలు గర్భిణులకు అందజేశారు. అనంతరం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు చిట్టిపూడివలస సాయి సేవా సహాయకులు భోజనాలు అందజేశారు. అలాగే వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్‌కు సాయిసేవా సమితి నిర్వహకులు శాలువతో ఘనంగా సన్మానించారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, ఓ.శాంతి కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు భాగ్యరాధ, కావ్య, లత, అనూషతో పాటు ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

చేపపిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుటిలో చెరువులో, భామిని మండలంలోని వడ్డంగిగూడ గ్రామ చెరువులో ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి 20వేల చేప పిల్లలను చెరువుల్లో గురువారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాలకు చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల మత్స్య సంపద పెరిగి గిరిజనులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాజన్న, ఎఫ్‌డిఒ గోపీకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వెలుగు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వెల్ఫేర్ మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణా నిర్మూలన గృహహింస, బాల్య వివాహాలు వంటి వాటిపై గ్రామస్థాయిలో ఈ కమిటీ మెంబర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, మహిళా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పద్మ, మహిళా పోలీసులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

సరస్వతి విగ్రహం వితరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి.ఆదినారాయణ పాఠశాలకు సరస్వతి విగ్రహం వితరణ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇటువంటి సేవా కార్యక్రమం చేయడం ఎంతో ఆనందాయకమని ఆయన్ను అభినందించారు. విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవలు చేయడం అభినందనీయని అన్నారు. గ్రామ పెద్దలు గాజాబ్ శ్రీను మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి పాటుపడడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేర్ టేకర్ల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - భామిని

ఎలిఫెంట్ కేర్ టేకర్లు గత 8 నెలలుగా జీతాల్లేకుండా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని, వీరికి ఉద్యోగ భద్రత కూడా లేదని, తక్షణమే వీరికి జీతాలు ప్రభుత్వమే చెల్లించాలని టిడిపి నాయకులు, సామాజిక కార్యకర్త పడాల భూదేవి కోరారు. మండలంలోని సన్నాయిగూడ, ఇసుక గూడ పరిసరాల ప్రాంతంలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్లుగా ఏనుగుల వల్ల పంట నష్ట పోయిన రైతులకు నేటికీ పరిహారం ప్రభుత్వం అందించలేదన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన 4 మండలాల రైతులకు రూ.57లక్షలు పరిహారం అందించమని గుర్తు చేశారు.

జియోట్యాగింగ్ మిషన్లు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ట్రాక్టర్లు, ప్రతి లగేజ్ వాహనం జియోట్యాగింగ్ మిషన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఐ.సత్యనారాయణ సూచించారు. మండలంలోని పి.లేవిడి పెట్రోల్ బంకు వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాల మేరకు ప్రతి లగేజీ వాహనానికి జియోట్యాగింగ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని, కావున ప్రతి ఒక్క లగేజ్ వాహనదారుడు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.

నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 కేసుల్లో పట్టుబడి సీజ్ చేసి సుమారు 1495 లీటర్ల నాటుసారాను 3 కేసుల్లో సీజ్ చేసిన 280 మద్యం సీసాలను డిఎస్‌పి, సిఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణ శివారులో ఉన్న తోటపల్లి పాత రహదారి వద్ద ధ్వంసం చేసినట్టు రూరల్ ఎస్సై సింహాచలం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు.

సైన్స్ ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల దోనుభాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ స్టేట్ ప్రతినిధులు గురువారం సైన్స్‌ల్యాబ్‌ను పరిశీలించారు. ఇటీవల ఎంపిక చేసిన పాఠశాలలో అటల్ టిక్కరింగ్ సైన్స్ ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. దీనివల్ల విద్యార్థులకు సైన్స్ నుంచి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఉపయోగ పడుతుందన్నారు విద్యార్థుల సృజనాత్మకత వేలికితీయడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి, కె.సుబ్బారావు ఉన్నారు

వైటిసిలో జాబ్ మేళా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో జాబ్ మేళా గురువారం నెల్లూరుకు చెందిన మొండల్‌జ్, టివిఎస్ కంపెనీ నిర్వహించారు. 55 మంది యువత హాజరు కాగా, 18 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన యువతకు జీతంతో పాటు రెసిడెన్సి హైయర ఎడ్యుకేషన్ సహాయ సహకారాలు అందిస్తామని ప్రతినిధులు శ్రీకాంత్ బాల కుమార్ తెలిపారు

ఇఒపిఆర్‌డికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

జీతం అడిగినందుకు గ్రీన్ అంబాసిడర్ తొలగింపు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

14 నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే జీతం ఇప్పించాలని కోరినందుకు ఆ గ్రీన్ అంబాసిడర్‌ను ఏకంగా విధుల నుంచి సర్పంచి, పంచాయతీ కార్యదర్శి తొలగించారు. ఇదేమిటని అడిగితే నీకు దిక్కున చోట చెప్పుకో అని అతడ్ని బెదిరించిన సంఘటన పార్వతీపురం మండలంలో జరిగింది.

ఈ సంఘటనపై విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి కృష్ణుడుకు గురువారం వినతిని అందజేశారు. అనంతరం గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పార్వతీపురం మండలం వీరభద్రపురంలో గ్రీన్ అంబాసిడర్‌గా జామి రాము ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. గత 14 నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీతాలు ఇప్పించాలని స్థానిక సర్పంచ్ రాజేంద్ర ప్రసాద్‌ను కోరగా, మీకు జీతాలివ్వడం కుదరదని, నీ దిక్కున చోట చెప్పుకో అనడంతో ఆ గ్రీన్ అంబాసిడర్ ఏం చేయాలో తెలియక అలా ఉండిపోయాడు. అంతటితో సర్పంచ్ ఆగకుండా వేరే ఒకర్ని పనిలో నియమించారు. తాను విధుల్లో ఉండగా వేరే ఒకర్ని ఎలా నియమిస్తారని అంబాసిడర్ రాము పంచాయతీ సెక్రెటరీ అడిగితే, అతను కూడా అదే మాట అన్నారు. నీ జీతం డబ్బులు కూడా ఇవ్వమని బెదిరింపు గురిచేశారని అన్నారు. 14 నెలలుగా గ్రామంలో పారిశుధ్య పనులు చేయించుకొని ఆర్థిక ఇబ్బందులతో జీతం ఇవ్వమని అడిగితే ఏకంగా విధుల్లో తొలగించడమే కాకుండా వేరే మరొకరికి నియమించడం అన్యాయమని, ఈ సంఘటనపై విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. సంఘటనకు కారణమైన సర్పంచి, పంచాయతీ కార్యదర్శులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ పిహెచ్‌సిల్లో నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎంఎస్‌ఎంఎ) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు చేపడుతున్న ఆరోగ్య తనిఖీలను, నమోదు వివరాలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బిపి, మధుమేహం, హీమోగ్లోబిన్, బరువు, మూత్ర పరీక్షల నివేదికలను పరిశీలించి హెచ్చు, తగ్గులు ఉన్నవారికి తగు చికిత్స అందజేసి సాధారణ స్థితి పొందే వరకు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కడ గర్భిణులతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడి వారి ఆరోగ్య స్థితిని పర్యవేక్షించారు. ప్రతి గర్భిణీకి నిర్దేశించిన కాన్పు తేదీని తెలియ జేయాలని సిబ్బందికి సూచించారు. హైరిస్క్ గర్భిణులకు కాన్పు సమయానికి వారం ముందుగానే నిర్దేశించిన ఆసుపత్రిలో చేర్చాలన్నారు. అలాగే సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిలో జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన వైద్య పరికరాలను, మందులు, పరీక్షలు విధిగా ఉపయోగించి ప్రసవ సమయానికి గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. పిఎంఎస్‌ఎంఎ, జెఎస్వై, జెఎస్ఎస్కె, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా అర్హులైన గర్భిణులకు సకాలంలో అందేలా చూడాలన్నారు. టిడి వ్యాక్సినేషన్ రెండు డోసులు నిర్దేశించిన సమయానికి వేయడం జరిగిందా ఎమ్సిపి కార్డులో పరిశీలించారు. కిల్కారీ సేవలు ఏ మేరకు వినియోగిస్తున్నారో ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ అరుణ్‌కుమార్, డాక్టర్ శామ్యూల్, డాక్టర్ ఎం.శిరీష, సూపర్ వైజర్స్ విజయకుమారి, శారద, నిర్మల, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రక్తపరీక్షలను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

పంటలపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలసలో మొక్కజొన్న, అపరాలలో అంతర పంటలు ఏ విధంగా వేసుకోవాలి, ఎటిఎం మోడల్ వేసే విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రకృతి వ్యవసాయ రీజనల్ తిమాటిక్ లీడ్ ప్రకాష్, టెక్నికల్ అధికారి హేమసుందర్, బలిజిపేట ఎఒ శ్రావణ్ కుమార్, ఎంసిఆర్ పి.లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిర్తివలసకు చెందిన వావిలపల్లి సన్యాసినాయుడు పొలంలో ఎటిఎం మోడల్ వేయించారు. విజిట్‌లో భాగంగా అధికారులంతా బయో ఇన్పుట్ సెంటర్‌ను సందర్శించి వారి ఆధ్వర్యంలో 2వేల లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేయించడం, 600 లీటర్ల పలుపత్ర ద్రావణాన్ని మామిడి తోటలకు స్ప్రేయింగ్ చేయించడం జరిగినది. ఈ సందర్భంగా రీజనల్ అధికారులు, చిన్న, సన్న కారు రైతులు బయో ఇన్పుట్ సెంటర్ సేవలను ఉపయోగించుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ ప్రశాంతి, ఐసిఆర్‌పి తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు

హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజలకు ఇచ్చిన హామీలంటినీ ప్రభుత్వం అమలు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలో గల శివన్నపేట సచివాలయం 2 వద్ద ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అన్న కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో గల అతికించిన సంక్షేమ పథకాలు డిస్ ప్లే బోర్డును గురువారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 25 సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా వాలంటరీ వ్యవస్థ ద్వారా, పరోక్షంగా 13 పథకాలు కలిపి ప్రభుత్వం అందిస్తుందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో ప్రజలంతా గమనించి ఎవరైతే మీకు మంచి పరిపాలన అందిస్తున్నారు అటువంటి నాయకుడిని ఎన్నుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షితరాజు, ఎంపిడిఒ వివి శివరామప్పు, ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, స్థానిక సర్పంచి జి.సుజాత ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు , వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు ఎ.రంగారావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వామియాజులు, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయచంద్రశేఖర్, పంచాయతీ ఇఒ కె. చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక సచివాలయం-1లో జగనే మళ్లీ సిఎం ఎందుకు కావాలి అన్న కార్యక్రమాన్ని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ప్రారంభించారు. సచివాలయంలో లబ్దిదారుల వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ప్రతినిధి సవర చంద్రశేఖర్, వైస్ ఎంపిపిలు కుండంగి సరస్వతి, మూటక విజయలక్ష్మి, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరిక మోహన్‌రావు, సర్పంచ్ ఎ.కళావతి, ఎంపిడిఒ కె.గీతాంజలి, సచివాలయం కార్యదర్శి సుదర్శనరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో గ్రామసచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వాలంటీర్లతో ఎపికి జగన్ ఎందుకు కావాలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిపి ఉరిటి రామారావు, జెడ్పీవైస్ చైర్మన్ బాపూజీనాయుడు మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు తమ శక్తి వంచన లేకుండా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.నారాయణమ్మ, వాలంటీర్లు మర్రాపు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక సచివాలయం-1లో ఎపి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎంపిపి వెంకటరమణనాయుడు పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి పి గౌరమ్మ, జడ్పిటిసి ప్రతినిధి జంపు ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ వై.వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, వ్యవసాయ సలహా మండల కమిటీ చైర్మన్ కెవిఎల్ ప్రసాదు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బి.లక్ష్మీకాంతం- లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, మేదర కార్పొరేషన్ డైరెక్టర్ గ్రంధి దుర్గమ్మ- శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్, ఇఒపిఆర్‌డి నాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొతాం ముత్యాలు సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొతాం ముత్యాలు సెంటర్ పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు ఉచిత వైద్య సేవలందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వైద్యులతో పరీక్షలు చేయించడంశుభపరిణా మమన్నారు. ఇటువంటి అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యసేవలను దబర, కుమ్మరిగండి, గుడ్డిమీదగూడ, బెన్నడుగూడ, కొతాం, ముత్యాలు కాలనీ, ఎగువ ముత్యాలు, నడిమి ముత్యాలు, బాపన్న ముత్యాలు, ముత్యాలు కాలనీ గ్రామ ప్రజలు ఉపయోగించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి ఎస్ రాము, మండల పార్టీ కన్వీనర్ సుమిత్ర, సర్పంచ్ బంగారమ్మ, కుసిమి సర్పంచ్ ఎస్.కూర్మారావు, ఎంపిటిసి సభ్యులు ఆదమ్మ, గణేష్, మంగయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైద్యాధికారి బి.రవీంద్ర, చాందిని తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్. చేశారు. గురువారం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఉంది కానీ ఇంతవరకు డిగ్రీ కాలేజ్ లేనందున మండలంలోని విద్యార్థులు డిగ్రీ చదువులకు రాజాం, బొబ్బిలి వెళ్లాల్సి ఉందన్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో చదువుకున్న పేద విద్యార్థులకు తీవ్రమైన ఇబ్బందిగా ఉందన్నారు. కావున విద్యార్థుల సంక్షేమాన్ని గుర్తుపెట్టుకొని వెంటనే డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి, ఏర్పాటుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు దుర్గ, వికాస్, శరత్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో రోలుగుడ్డి పంచాయతీ పరిధిలో గల తూట్లుగూడ, కోడిపిల్లిగూడ, మొఖరనాయుడుగూడ, కొత్తగూడలో పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫేస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరిస్తూ ఖచ్చితంగా మళ్లీ చంద్రబాబునాయుడు సిఎంగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షులు సవర సంతోష్, నిమ్మక మురళి, ఉమా, సవర ప్రసాద్, సవర సురేష్, సవర ప్రకాష్, సవర లక్కయ్య, సవర తిమత్, సవర భాస్కరరావు, గ్రామపెద్దలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరురూరల్: అంధకారంలో ఉన్న రాష్ట్రానికి వెలుగులు నింపాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొత్తవలస పంచాయతీ కొత్తవలస, దాగరివలస, గుంద్రప్పవలస, బుట్టిగానివలసలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే భంజదేవ్‌తో నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో అంశాలను వివరించి, కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణ, బూసి తవుడు, తాడుతూరి తిరుపతిరావు, యుగంధర్, రమాదేవి, శ్రీను, చొక్కాపు వెంకటి, మండల గిరిజన శాఖ అధ్యక్షులు లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మహిళలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలసలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి గ్రామంలో ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామస్తులు జగదీశ్వరిని ఘనంగా ఆహ్వానించి సాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, కురుపాం నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు లంక గోపాలం, రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి మర్రాపు పురుషోత్తం నాయుడు, నియోజకవర్గ వెలమ సంఘం అధ్యక్షులు రెడ్డి బలరాం స్వామినాయుడు, క్లస్టర్ 6 జోగి భుజంగరావు, నాయకులు బంటు రామారావు, బంటు సతీష్, బంటు లోకనాథం, బొట్ట సత్యం నారాయణ, బొంగు వెంకటనాయుడు పాల్గొన్నారు.

గిరిజన సేవకుడు 'రవి'

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలపై నిత్య సేవకుడుగా పనిచేస్తున్నారు మండలంలోని పెద్దపల్లికి వలస గ్రామానికి చెందిన గేదెల రవి. ఉన్నత చదువులు చదివిన ఆయన ట్రిబుల్ ఐఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ తనకున్న చదువును అందరికీ పంచుతూ, అందర్నీ అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు మన్య ప్రగతి సంస్థని స్థాపించారు. దీనిద్వారా గ్రామదర్శిని పేరిట మన్యంలోని అన్ని గ్రామాలను సందర్శించి అక్కడి గిరిజనులు పడుతున్న అవస్థలను తెలుసుకొని ఆ సమస్యలను అధికారుల వద్దకు తీసుకుని వెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.

గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలు, గిరిజన చట్టాలు, గిరిజన, మహిళా హక్కులు, గిరిజన సంక్షేమ పథకాలు అమలు సక్రమంగా అమలు జరుగుతున్నాయా లేదా ప్రజలకు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకొని అవి వారికి అందేలా కృషి చేస్తున్నారు. అలాగే నిరుద్యోగ సమస్య, గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యల కల్పన తదితర సమస్యలను గుర్తించి స్పందనలో అధికారుల వద్దకు వెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. వీటితో పాటు గిరిజన సంస్కృతి - సాంప్రదాయం, గిరిజన భాషల పరిరక్షణపై కృషి చేస్తున్నారు. జీవో 3 పునరుద్దరణ, బోయ - వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల నష్టాలపైనా, ఐదో షెడ్యూల్డ్ ఏరియాలోని భూ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా చైతన్య అవహగాన కార్యక్రమం నేటికీ 285వ రోజులు గ్రామదర్శి ద్వారా పూర్తి చేసుకున్నారు. సామాజిక సేవల్లో భాగంగా నిరుపేదలు, గిరిజన గర్భిణీల కోసం 30 మంది వరకు అత్యవసర ఆపరేషన్ సమయంలో బ్లడ్ ఏర్పాట్లు చేసి రక్తదానం దానం చేసి ప్రాణాలు కాపాడారు. ఉద్యోగ, ఉన్నత విద్యపై గిరిజన నిరుద్యోగులు, విద్యార్థుల కోసం సెమినార్లు ఏర్పాటు చేసి వారి ఉన్నత విద్యకు తన వంతుగా అలుపెరుగని కృషి చేస్తున్నారు. తాను చేస్తున్న సామాజిక సేవలకు ప్రజలు, అధికారులు మరింత తోడ్పాటును అందించాలని కోరుతున్నారు.

చట్టాలపై చైతన్యం

గిరిజన సమస్యల పరిష్కారం దిశగా అడుగులు

బోయ-వాల్మీకులను ఎస్‌టిజాబితాలో చేర్చొద్దంటూ రవి ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న గిరిజనులు (ఫైల్)

కురుపాంను కరువు ప్రాంతంగా ప్రకటించాలి : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి డిమాండ్ చేశారు. ఈ ఏడాది సరైన వర్షాల్లేక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో సాగునీటి వనరులు ఉన్నా చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్లు పూర్తిగా శిథిలమవ్వడంతో పంట పొలాలకు నీరందని పరిస్థితి ఉందన్నారు. దీంతో వర్షాధారం పైనే ఆధారపడాల్సి వస్తుందని తెలిపారు. ఈ ఏడాది 50 శాతం వరకు వరి నాట్లు వేసినా వర్షాలు కురవకపోవడంతో పూర్తిగా ఎండిపోయి బీడు భూములుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర కూడా లేకుండాపోతుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో కొనుగోలు చేపట్టడంలేదని అన్నారు. కరువుపై నేటి వరకు ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇదేనా రైతు సంక్షేమ ప్రభుత్వమని విమర్శించారు. వెంటనే అధికారులచే సర్వే చేయించి కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రోడ్లు పూర్తిగా పాడైపోయి గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లు మరమ్మతులు చేయించకుండా బస్సు యాత్రల పేరుతో వైసిపి నాయకులు ఊర్లు తిరుగుతున్నా రోడ్ల దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముందు పాడైన రోడ్లను గుర్తించి మరమ్మతులు చేయించి తర్వాత బస్సు యాత్ర చేపడితే బాగుంటుందని హితవు పలికారు.

పత్తిలో అంతరపంటగా వేరుశనగ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రయోగాత్మకంగా పత్తిలో అంతర్ పంటగా వేసిన వేరుశెనగ దిగుబడి బాగుందని, రైతులు కేవలం ఒకే పంటపై ఆధారపడకుండా వేసుకున్నట్లయితే అంతర్ పంటల ఆదాయం ప్రధాన పంటకు పెట్టే పెట్టుబడికి సమానంగా వస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కర్రివలసలో రైతు గూనాపు రామారావు పత్తి చేనులో వేసిన వేరుశనగ అంతర్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు తన పత్తిలో వేరుశెనగ, మినుములు వేసానని, చుట్టూ కంది విత్తనాలు వేసుకున్నామని తెలిపారు. అర ఎకరంలో మూడు బస్తాల వేరుశనగ దిగుబడి వచ్చిందని, మినుములు అంతర్ పంట కూడా బాగుందన్నారు. కావున రైతులకు ఈ విధానం ఎంతో మేలని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ అంతర్ పంటలతో కేవలం అదనపు ఆదాయం రావడమే కాకుండా జీవ వైవిధ్యం పెరిగి ఉపయోగకర కీటకాల సంఖ్య పెరగడం వల్ల చీడిపీడల ఉధృతి తగ్గుతుందని, కలుపు ఉధృతి కూడా తగ్గుతుందని తెలిపారు. అంతేకాకుండా వేరుశనగ, మినుముల వేర్ల బుడుపులపై ఉండే రైజోబియం బ్యాక్టీరియా గాలిలో ఉన్న నత్రజనిని గ్రహించి ప్రధాన పంటకు యూరియాను అందిస్తుందన్నారు. కావున రైతులంతా అంతర్ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్ పి.సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన మాతృభాష శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గిరిజన యువ శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు మాతభాషలో శిక్షణా తరగతుల కార్యక్రమం గురువారం ముగిసింది. సవర భాషలో విద్యార్థులకు ఏ విధంగా బోధించాలి అనే అంశంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాఠ్యాంశాలపై బోధనా పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం తమ తమ పాఠశాలల్లో మాతృభాషలో విద్యాబోధన అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పార్వతీపురం ఐటిడిఎ డిడి శ్రీనివాసరావు సూచించారు.

టిఆర్‌ఎన్‌వలసలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తులసిరామినాయుడువలసలో ఏనుగులు సంచరిస్తున్నాయి. కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి తరలివచ్చిన ఏనుగులు గొట్టివలస, దళాయివలస పరిసర ప్రాంతాల్లో సంచరించిన ప్రస్తుతం తులసి రామినాయుడువలసలో సమీపంలో సంచరిస్తున్నాయి. అలాగే పార్వతీపురం- గరుగుబిల్లి ఆర్‌అండ్‌బి రహదారి పరిధిలోని దలైవలస జంక్షన్లో తెల్లవారుజామున గడిచిన నాలుగు రోజుల నుంచి తిష్ట వేస్తున్నాయి. దాదాపు రెండు గంటల పాటు ప్రధాన రహదారిపై ఉంటున్న ఏనుగులు తెల్లవారిన అనంతరం సమీప కొండ వద్దకు వెళ్తున్నాయి. గురువారం ఉదయం సుమారు 5గంటల సమయంలో రహదారిపై కరిరాజులు తిష్ట వేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచి పోయాయి. అలాగే రహదారిపై ఏనుగులు ఉండడంతో వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేశారు. దలాయివలస జంక్షన్ నుంచి గొట్టివలస జంక్షన్ వరకు ఆర్‌అండ్‌బి రహదారి పక్కనే అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగులు ప్రస్తుతం సంచరిస్తుండంతో తులసిరామినాయుడు వలస, దలాయివలస, గొల్లవానివలస తదితర గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను తక్షణమే ఈప్రాంతం నుంచి తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.